నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 2 మే 2025 | HYDERABAD



## పగలు ఎండ..రాత్రి వాన

సిటీబ్యూరో, మే 1(నమస్తేతెలంగాణ): గ్రేటర్‌లో గురువారం ఉదయం ఎండలు మండిపోగా, రాత్రి సమయంలో వర్షం పడింది. రాత్రి 9 గంటల వరకు హాఫీజ్‌పేటలో 1.0 సెం.మీలు, రాజేంద్రనగర్‌లో 5.0మి.మీలు, కూకట్‌పల్లిలో 4.5 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు.



హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. -కేపీహెచ్‌బీ కాలనీ, మే 1

# నక్కవాగును నలిపేస్తున్నరు!

### మూడు గ్రామాల పరిధిలో కుచించుకుపోయిన వాగు.. ఎఫ్‌టీఎల్‌ను సైతం ఆక్రమించి ప్లాట్లుగా మారుస్తున్న రియల్టర్లు

*నక్కవాగు.. దశాబ్దాల పాటు పరిశ్రమల కాలుష్యాన్ని గొంతులో నింపుకొని ఏడాదిపాటు పారే నీటి వనరు ఇది. చివరకు ఆ కాలుష్య కాసారాన్ని సైతం రియల్టర్లు వదలడం లేదు. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు నక్కవాగును సైతం నలిపేసి.. ప్లాట్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. బఫర్‌జోన్ దేవుడెరుగు.. ఎఫ్‌టీఎల్‌ను సైతం మట్టితో కప్పేయడంతో మూడు గ్రామాల పరిధిలో వాగు కుచించుకుపోయింది. తెరపైన రియల్టర్లు కనిపిస్తున్నా..తెర వెనక మాత్రం రాజకీయ నేతల అండతో పాటు అధికారుల ఆశీర్వాదం కూడా ఉన్నదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా యంత్రాంగం స్పందించకపోతే దాదాపు ఐదు కిలోమీటర్ల పరిధిలో నక్కవాగు సన్నబడటమే కాదు భవిష్యత్‌లో జనావాసాలను వరదతో పాటు పరిశ్రమల వ్యర్థాలూ ముంచెత్తే ప్రమాదం పొంచి ఉన్నది.*



నక్కవాగులో మట్టి పోస్తున్న దృశ్యం

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని నక్కవాగు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నుంచి కాలుష్య కేంద్రంగా ప్రసిద్ధి. పటాన్‌చెరు, గడ్డపోచారం, పాశమైలారం వంటి పారిశ్రామికవాడల నుంచి యధేచ్ఛగా వచ్చే రసాయన వ్యర్థాలు ఉసికె వాగు నుంచి నక్కవాగులో కలుస్తాయనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. దీనిపై సంవత్సరాల తరబడి అధ్యయనాలు, సర్వేలు జరిగాయి. ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నా.. నక్కవాగుకు కాలుష్య భూతం నుంచి పూర్తిగా విముక్తి లభించలేదు. పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో మండు వేసవిలోనూ ఈ వాగు ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా రియల్టర్ల కండ్లు కూడా ఈ వాగుపైనే పడ్డాయి. వాగు పక్కన ఉన్న వ్యవసాయ భూములను రైతుల నుంచి కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు వాటిని వెంచర్లుగా మలుస్తున్నారు. ఈ క్రమంలో ఆనుకొని ఉన్న వాగును సైతం అందులో కలిపేసుకొని ఎంచక్కా ప్లాట్లు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అసలు బఫర్ జోన్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టవద్దని ఉంటే.. ఇక్కడ ఏకంగా వాగు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపుతున్నారు. ప్రధానంగా పటాన్‌చెరు అవుటర్ రింగు రోడ్డు నుంచి ముత్తంగి, చిట్కూరు శివారు వరకు దాదాపు ఐదు కిలోమీటర్లకు పైగా భారీ వాహనాలతో వందలాది ట్రిప్పుల్లో మట్టి పోసి నక్కవాగును చిన్న కాల్వగా మారుస్తున్నారు. పటాన్‌చెరు ఓఆర్‌ఆర్ సమీపంలో ఓ నిర్మాణ సంస్థ నక్క వాగును మట్టితో మూసివేసి సిమెంట్‌తో నిర్మాణాలు చేపట్టింది.



### అధికారుల మౌనం..

నక్కవాగును నలిపేయడంలో పైకి రియల్టర్ల పాత్ర కనిపిస్తున్నా.. వెనక రాజకీయ నాయకులు కొందరితో పాటు అధికారుల మిలాఖత్ కూడా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో అందులో వ్యర్థ జలాలు పారుతున్నా.. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదను మంజీరా వరకు ఈ నక్క వాగు మోసుకుపోతుంది. మిగతా IIవ పేజీలో

### నక్కవాగు ఆక్రమించే వారి పై చర్యలు

పటాన్‌చెరు మండలం నుంచి ప్రవహిస్తున్న నక్క వాగును ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం. వాగు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ గుర్తించి ఆక్రమణలు తొలిగిస్తాం. వాగును ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని.. సర్వే చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.
**- రంగారావు, పటాన్‌చెరు తహసీల్దార్**

# నిబంధనలకు ఉరి.. నోటీసులతో సరి

### జూబ్లీహిల్స్ సర్కిల్‌లో అడుగడుగునా అక్రమ నిర్మాణాలు

### నోటీసుల పేరుతో సహకరిస్తున్న బల్దియా సిబ్బంది

బంజారాహిల్స్, మే 1: జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 పరిధిలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వీటిపై రోజువారీగా అనేకమంది ఫిర్యాదులు చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఏమాత్రం చలనం కనిపించడం లేదన్న.. ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీతో పాటు కొంతమంది సిబ్బంది సహకారంతోనే గతంలో ఎన్నడూ లేని విధంగా బస్తీలు, కాలనీలు అనే తేడాలేకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఏదైనా అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే రంగంలోకి దిగే టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణదారుడికి నోటీసు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపణలు వినినిస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులతో చేతులు కలపడం, నోటీసులు ఇచ్చి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేలా సహకరించడం పరిపాటి అయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అక్రమ నిర్మాణాలు ఇవిగో..

బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని కమలాపురి కాలనీ ఫేస్-3లో ఇందిరానగర్ బస్తీలోకి వెళ్లే ప్రధాన రహదారిపై నర్సింగ్ యాదవ్ అనే మద్యం వ్యాపారి సుమారు ఏడాది కాలంగా భారీ వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. సుమారు 600 గజాల స్థలంలో సెల్లార్‌తో పాటు



జూబ్లీహిల్స్ రోడ్ నం. 5 నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2కు వెళ్లే రహదారిపై నిర్మిస్తున్న ఆరంతస్తుల అక్రమ నిర్మాణం



## కేసీఆర్ ఆరోగ్య ఫలం

నిరుపేద హృద్రోగులకు వరం..
ఉస్మానియా క్యాథ్‌లాబ్
2022లో రూ. 7 కోట్లతో
ఏర్పాటు చేసిన కేసీఆర్ సర్కారు
మూడేండ్లలో 20 వేల మందికి పైగా
గుండె పరీక్షలు, చికిత్సలు IVలో

## ఆరేండ్లలోపు పిల్లలకు అద్దాలే!

36 అంగన్‌వాడీ కేంద్రాల్లో
113 మంది పిల్లలకు కంటి సమస్యలు

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఆరు నెలల వయస్సు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ మొదటివారంలో ప్రారంభించిన ఈ సర్వేలో రెండు వైద్యబృందాలుగా ఏర్పడి 36 అంగన్‌వాడీ కేంద్రాల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4020 మంది చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 20 మందికి అద్దాలు అవసరమవుతున్నాయి. వివిధ రకాల కంటి సమస్యలతో 53 మంది, కంటి తిప్పుకుపోవడం సమస్యతో 13 మంది, కంటి పైరెప్ప వాలిపోవడం సమస్యతో ఇద్దరు, విటమిన్ ఏ లోపంతో వచ్చే గాయాలతో 29 మంది, మైయోఫియాతో 6గురు, చూపు మసకబారి ముగ్గురు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దాలు అవసరమైన చిన్నారులందరికీ ఉచితంగా అద్దాలు, మందులు ఇవ్వనున్నారు.

### వెంటాడుతున్న సిబ్బంది కొరత..

జిల్లాలో 28 మంది పీఎంఓ వైద్యులు అవసరం ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ప్రస్తుతం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ఆరేళ్లలోపు చిన్నారులకు మూడు నెలల్లోనే కంటి పరీక్షలు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది కొరతతో వైద్యాధికారులు ఆలోచనలో పడ్డారు. మరోవైపు మే నెలలో ఎండల తీవ్రత కారణంగా నెలరోజులపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో చిన్నారులంతా సెంటర్లకు రాకుండా ఇంటి పట్టునే ఉండటంతో స్క్రీనింగ్ పరీక్షలకు బ్రేక్ పడింది. తిరిగి జూన్ నెలలో సెంటర్లు ప్రారంభించగానే టెస్టులు మొదలుపెట్టనున్నారు.


# టౌన్ ప్లానింగ్.. షట్‌డౌన్!

- గతితప్పిన జీహెచ్‌ఎంసీ పట్టణ ప్రణాళిక
- ఏడాదిన్నరలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు
- పేదల ఇండ్లను కూల్చుతూ పెద్దల దిక్కుచూడని బుల్డోజర్లు
- ఓవైపు అనధికారిక నిర్మాణాలను ప్రోత్సహిస్తూనే మరోవైపు హైడ్రా పేరిట కాంగ్రెస్ సర్కారు హడావుడి

**హైదరాబాద్ ఆగమాగం**

### ఉదాహరణ-1

'ప్రణీత్ ప్రణవ్ నైట్ ఉడ్స్' పేరుతో వెంకట ప్రణీత్ డెవలపర్స్ సంస్థ పటాన్‌చెరులో విల్లా చేపట్టింది. 29 ఎకరాల 23 గుంటల్లో లే అవుట్ అభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకున్నది. నీటి పారుదల శాఖ నుంచి 28 ఎకరాల 3 గుంటలకు నిరభ్యంతర పత్రం వచ్చింది. మిగిలిన ఎకరంన్నర విస్తీర్ణం.. నాలా బఫర్ జోన్ అని తేల్చింది. సదరు నిర్మాణ సంస్థ మాత్రం మొత్తం విస్తీర్ణాన్ని అభివృద్ధి చేసింది. నాలాను మూడు మీటర్ల మేర, బఫర్ జోన్‌ను 9 మీటర్ల ప్రాజెక్టులో కలిపేసుకున్నది. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ ఇంజినీర్లు నివేదిక ఇవ్వగా దాని అధారంగా జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేత నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. నిర్వాహకులు మాత్రం ప్రాజెక్టును పూర్తిచేశామని, ఓసీ ఇవ్వాలని జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనిని తిరస్కరించినా.. అక్రమంగా వెలిసిన విల్లా విషయంలో అటు హైడ్రా, ఇటు టౌన్ ప్లానింగ్ ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి.



### ఉదాహరణ-2

కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ బ్రిడ్జి సమీపంలో సర్వే నంబర్ 988, 991లోని దాదాపు 2.5 ఎకరాల్లో బహుళ అంతస్తుల (నాలుగు బ్లాక్‌లలో) నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీకి బిల్డర్ దరఖాస్తు చేసుకున్నాడు. నిరుడు ఆగస్టులో అధికారులు అనుమతి (ఫైల్ నంబరు 003142) ఇచ్చారు. నిర్మాణ సమయంలో సదరు బిల్డర్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన 40 అడుగుల స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపి అడ్డదారిలో అనుమతులు పొందాడు. ఏళ్ల తరబడి రోడ్డు ఉన్నదని గుడ్డిగా అనుమతిచ్చిన అధికారులు, ఇప్పుడు ఆ స్థలం హౌసింగ్ బోర్డుదేనని నిర్ధారణకు వచ్చారు. సదరు బిల్డర్ ఐదు బ్లాక్‌లలో ఐదు ఫ్లోర్లతో యథేచ్ఛగా నిర్మాణ పనులు చేపడుతున్నాడు. హౌసింగ్ బోర్డు, టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యాన్ని అసరా చేసుకొని కోర్టు నుంచి స్టే తెచ్చుకొని అటు వైపు హౌసింగ్ బోర్డు అధికారులు రాకుండా చేశాడు. టౌన్‌ప్లానింగ్ మాత్రం కూల్చివేత నోటీసులిస్తామని హడావుడి చేస్తున్నదే తప్ప..ఇప్పటి వరకు ఇచ్చిందే లేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇవి మచ్చుకు మాత్రమే.. అక్రమ నిర్మాణాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యుడికి ఒకలా, సంపన్నులకు మరోలా చట్టాన్ని ప్రయోగిస్తున్నది.



హైదరాబాద్ సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : ఒకవైపు అనధికారిక నిర్మాణాలను ప్రోత్సహిస్తూనే మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హల్‌చల్ చేస్తున్నది. పెద్దోడిని వదిలేసి సామాన్యుడి గుండెల్లో గునపం దింపుతున్నది. పొట్టచేత పట్టుకొని హైదరాబాద్ వచ్చి ప్రభుత్వ అసైన్డ్ స్థలాల్లో వేసుకున్న గుడిసెలను, మురుగు కాలువలు, నాలా, చెరువుల సమీపంలో కట్టుకున్న చిన్నపాటి నిర్మాణాలను కూల్చేయడంలో హైడ్రా ముందువరుసలో ఉంటున్నది. వారంతం వచ్చిందంటే చాలు సామాన్యుడి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఒక్కో రూపాయి పోగేసి, ఈఎంఐలు చెల్లించుకుంటూ కట్టుకున్న పేదోడి సొంతింటిని అక్రమం పేరుతో హైడ్రా బుల్డోజర్లు కూల్చేస్తున్నాయి. బడాబాబుల నిర్మాణాల వైపు మాత్రం వెళ్లడం లేదు. వెళ్లినట్టే వెళ్లి బేరం కుదరగానే తిరిగొచ్చేస్తున్నాయి. బాచుపల్లిలో ఓ ప్రముఖ బిల్డర్‌కు చెందిన రెండు బ్లాకులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని, కూల్చేస్తామని వెళ్లిన హైడ్రా బుల్డోజర్లు వెనక్కి తగ్గడం వెనుక ప్రభుత్వ పెద్దలకు భారీగా ముడుపులు అందాయన్న ఆరోపణలున్నాయి. జంట జలాశయాల పరీవాహక ప్రాంతమైన 111 జీవో పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధుల విషయంలోనూ హైడ్రా ఎలా వ్యవహరించిందో అందరికీ తెలిసిందే. హైటెక్‌సిటీ అయ్యప్ప సొసైటీలో భారీ భవంతిని నేలమట్టం చేసిన హైడ్రా..ఆ తర్వాత సొసైటీ అక్రమ నిర్మాణదారులు కొందరు ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకోగానే వెనక్కి తగ్గిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూనే మరోవైపు అనధికారిక నిర్మాణాల కూల్చివేతలో పక్షపాత ధోరణి ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నది.

### అయ్యప్ప సొసైటీలో అవినీతి గద్దలు

అయప్ప సొసైటీలో 200 గజాల నుంచి వెయ్యి గజాల విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరుగుతున్నది. సొసైటీలో అనధికారికంగా నిర్మాణాలకు వెలకట్టి



కూకట్‌పల్లిలోని వసంత్‌నగర్‌లో ఓ అక్రమ నిర్మాణం

### 16 నెలల్లో పుట్టగొడుగుల్లా..

కొందరి తీరుతో పట్టణ ప్రణాళికా విభాగం పూర్తిగా గాడి తప్పింది. అనుమతులు ఇచ్చి వదిలేయడంతో సదరు నిర్మాణదారులు ప్రమాదకరంగా కట్టడాలు చేపడుతున్నా కనీస బాధ్యతగా వ్యవహరించడం లేదన్న విమర్శలున్నాయి. అనుమతులు పొందిన నిర్మాణదారులు అందుకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా టౌన్‌ప్లానింగ్ అడ్డుకట్ట వేయలేకపోతున్నది. ఫిర్యాదు చేసినా అధికారులపై ఒత్తిడి తెచ్చినా కేవలం నోటీసులతోనే సరిపెట్టి చేతులు దులుపుకొంటున్నది. ఇదే సమయంలో షోకాజ్ అందుకున్న నిర్మాణదారుడు డబ్బులిస్తే ఆ నిర్మాణ జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆదేమని ఆడిగితే సరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ లేదని స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్తున్నారు. 16 నెలల్లో నగరంలో వేలాది అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయని హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులే స్పష్టం చేస్తున్నాయి.

మరీ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కప్పం వసూలు చేస్తున్నట్టు విమర్శలు వచ్చాయి. ఇక్కడ జరిగే అక్రమ నిర్మాణాలకు స్థలం, విస్తీర్ణాన్ని బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఫ్లోర్‌కు రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల మేర వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కప్పం కట్టిన భవనం జోలికి ఏ అధికారీ వెళ్లరన్న చర్చ నడుస్తున్నది. బీఆర్‌ఎస్ హయాంలో అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపినా.. కొన్ని నెలలుగా విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఈ దందా వెనుక కొందరు అధికార పెద్దలు, స్థానిక అధికారుల హస్తం ఉన్నట్టు విమర్శలున్నాయి. జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేయకపోవడంతో గురుకుల్ ట్రస్ట్ భూములన్న అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇడియా లే అవుట్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గురుకుల్ ట్రస్ట్ భూములపై న్యాయస్థానం ఇచ్చిన స్టేటస్ కో ఉన్నా అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. వీటికి రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోతున్నాయి. జలమండలి అధికారులు నల్లా కనెక్షన్లు, విద్యుత్ అధికారులు కరెంటు కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్న ప్రహరీ కట్టినా ముప్పుతిప్పలు పెట్టే జీహెచ్‌ఎంసీ అధికారులు.. కండ్ల ముందే బడా నిర్మాణాలు జరుగుతున్నా మిగతా IIవ పేజీలో

# నెలకోసారి ఆగుడే..

- సాంకేతిక సమస్యలతో తరచూ మొరాయిస్తున్న మెట్రో
- అధునాతన సాంకేతికత ఉన్నా సేవలకు అంతరాయం

సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ) : పేరుకే ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం.. కానీ నిర్వహణ లోపంతో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు మెట్రో ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఆఫీసులకు, ఇండ్లకు చేరుకునేందుకు, ట్రాఫిక్ సమస్యల నుంచి బయటపడాలని మెట్రోలో ప్రయాణిస్తే ఎప్పుడు ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటున్నాయి. దేశంలోనే సమర్థవంతమైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్ మెట్రోకు ఇప్పుడు తలంపులు తప్పడం లేదు. ఎల్ అండ్ టీ నిర్వహణ లోపమో, లేక అధికారుల పర్యవేక్షణ వైఫ్యలమో తెలియదు కానీ ప్రయాణికులను మాత్రం భయాందోళనకు గురవుతున్నారు. గురువారం అమీర్‌పేట- మియాపూర్ మార్గంలో మొరాయించిన మెట్రోతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు మెట్రో రాకపోకలు నిలిచిపోగా, ఆ మార్గంలో మిగతా సర్వీస్‌లకు తీవ్ర అంతరాయం కలిగింది. ఎల్బీనగర్-మియాపూర్ మార్గంలో రద్దీ సమయంలో మెట్రోలో తలెత్తిన సాంకేతిక సమస్యతో భరత్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో బోగీల్లో ఉండి అరగంటకుపైగా ప్రయాణికులు ఎదురు చూశారు.

### పడకేసిన నిర్వహణ..

సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నామని చెబుతున్నా..మెట్రోకు నిత్యం ఎదురయ్యే టెక్నికల్ సమస్యలతో హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఏడాది కాలంగా నగరంలో అనేకసార్లు మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడింది. గతేడాది మార్చి 27న నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తున్న మెట్రో సర్వీసు జూబ్లీహిల్స్ చెక్ వద్ద నిలిచిపోగా, దాదాపు 15 నిమిషాల పాటు సేవలు ఆగిపోయాయి. జూన్ నెలలో మెట్రో ఫ్రీక్వెన్సీ పెంచగా వచ్చిన టెక్నికల్ సమశ్యాలతో ఆగిపోతే ప్రయాణికులు ఎమర్జెన్సీ డోర్ల నుంచి బయట పడ్డారు. నవంబర్ 11న తలెత్తిన టెక్నికల్ సమస్యలతో ఏకంగా అన్ని రూట్లలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. డిసెంబర్ నెల్లలోనూ లక్డీకాపూల్, మలక్‌పేట వద్ద టెక్నికల్ సమస్యల కారణంగా అగగా, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన సమస్యలతో ఏకంగా రెండున్నర గంటలపాటు మెట్రో సేవలు నిలిచాయి. ఏడాది ఏప్రిల్ 3న కూడా ఎల్బీ నగర్- మియాపూర్ మార్గంలో నాంపల్లి దగ్గర ఒక్కసారిగా మెట్రో ఆగిపోయింది.

